క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం : మండలంలోని కటికపల్లి సచివాలయ పరిధిలోని పిళ్లగుండ్లపల్లి, ఎస్టీ కాలనీ, కటికపల్లి, బీసీ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొంటారని జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధి అమలు, సమస్యలను డిప్యూటీ సీఎం తెలుసుకుంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలన్నారు.

వైభవంగా ఆరాధన మహోత్సవం



మహాభిషేకంలో పాల్గొన్న భక్తులు

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీగోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం 330వ ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు గోపూజ, 8 గంటలకు మహాభిషేకం చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం నిర్వహించారు.

అలరించిన బలి బండికుంభాలు



బండి కుంభం తీసుకెళ్తున్న వేషధారి

వెదురుకుప్పం: మండలంలోని మొరవ గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం బలిబండి కుంభాల కార్యక్రమం అలరించింది. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణిచే హరికథా కాలక్షేపం జరిగింది. సాయంత్రం బలి కూడుతో బండికుంభాలు నిర్వహించి ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

సంగీత సామ్రాట్ ఘంటసాల

తిరుపతి కల్చరల్: తన మధుర కంఠస్వరంతో గానం చేసి ప్రజల గుండెల్లో నిలిచిన సంగీత సామ్రాట్ ఘంటసాల అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. ఘంటసాల శత జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో చేపట్టిన రెండు రోజుల అమృత గాన నీరాజనం కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఎమ్మెల్యే భూమన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సినిమా సంగీతంలో రారాజుగా వెలుగొందిన వ్యక్తి ఘంటసాల అని తెలిపారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి గర్భాలయం ముందు అన్నమయ్య తర్వాత పాట పాడిన ఏకైక వ్యక్తి ఘంటసాల అని తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, పారిశ్రామిక వేత్త పీసీ.రాయులు ఘంటసాల సంగీతం గురించి కొనియాడారు. గాయనీ గాయకులను సత్కరించారు. తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సీఆర్‌కే.శేషగిరిరావు, ప్రసాద్‌రావు, శాంతావాణి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్య జోశ్యుల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో కళాకారులు కోమలి, ద్రాసిత, ప్రణతి, కీర్తి, నక్షత్ర, వర్షిణి, పావని, అక్షర, హృతి, కీర్తి, సాహితి, సాహిత్య, ప్రణ్యల ప్రదర్శనలు అబ్బురపరిచాయి.

రేపటి నుంచి సంస్కార శిబిరం

తిరుపతి కల్చరల్: రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 21వ తేదీ వరకు విద్యార్థుల కోసం సంస్కార శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానందజీ తెలిపారు. ఇందులో వేద మంత్రాలు, భగవద్గీత శ్లోకాలు, ధ్యానం, యోగా, డ్రాయింగ్, పద్య పఠనం, వ్యక్తిత్వ వికాస కథలు, కర్నాటక సంగీతం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలను నేర్పిస్తామని వెల్లడించారు. 5 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఫీజు రూ.800 చెల్లించాలని సూచించారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం నాగయ్యగారిపల్లి వద్ద ఆదివారం కారు ఢీకొని ఇద్దరు యువతులకు తీవ్ర గాయాలయ్యాయి. రంగంపేటకు చెందిన తేజశ్రీ, శశికళ స్కూటర్‌పై తిరుపతికి బయలుదేరారు. నాగయ్యగారిపల్లి వద్ద తిరుపతి నుంచి మదనపల్లికి వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన యువతులను స్థానికులు అదే కారులోనే రుయాకు తరలించారు. చంద్రగిరి ఎస్‌ఐ వంశీకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెకే పాలన వచ్చే.. జనం మెచ్చే



నగరి: ఎం.కొత్తూరులో నూతనంగా ప్రారంభించిన ఆర్బీకే కేంద్రం

గత టీడీపీ ప్రభుత్వ పాలలో ఒక సంక్షేమ పథకం మంజూరు కావాలంటే ఆ మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి అధికారులు, జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది. పైగా సాధారణ ప్రజలకు కూడా రాజకీయ రంగు అంటించేవారు. ప్రతిపక్షపార్టీ సానుభూతిపరులు అంటే అసలు స్పందించేవారు కాదు. అయితే నాలుగేళ్ల కిందట రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక పల్లె వాకిటకే ప్రభుత్వ పాలన తీసు కొచ్చారు. మహాత్ముడు కలలుగన్న గ్రామస్వరాజ్యం దిశగా పాలన సాగిస్తున్నారు.

- మహాత్ముడి కలల సాకారం దిశగా వైఎస్సార్‌సీపీ పాలన
- గ్రామ స్వరాజ్యం ఏర్పాటు దిశగా ప్రభుత్వం
- గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న పల్లెజనం



మిట్టపాళెంలో ఒకే ప్రాంగణంలో నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, ఆర్బీకే కేంద్రం

నగరి: ప్రతి గ్రామ పంచాయతీలో సచివాలయాలు, అనుబంధ కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన అనే మాటను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సుసాధ్యం చేసింది. నియోజకవర్గంలో పల్లెలన్నీ సరికొత్త గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పాల శీతలీకరణ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు వాటికి నూతన భవనాలు మంజూరు చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం, మెరుగైన సేవలందించేందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నూతన కార్యాలయాల భవనాలను నిర్మిస్తున్నారు. పలుచోట్ల నిర్మాణాలు పూర్తి కాగా వాటిలోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. గ్రామసర్పంచ్ మొదలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, రెవెన్యూ, మండల ప్రజాపరిషత్ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వ్యవసాయశాఖ ఇలా శాఖల ఉద్యోగులు గ్రామాల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

కోట్ల రూపాయల అభివృద్ధి పనులు..

ప్రభుత్వం భవనాల నిర్మాణానికి కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు, సబ్‌సెంటర్లకు రూ.17.5 లక్షలు, రైతు భరోసా కేంద్రాలకు రూ.23 లక్షలు, పాలకేంద్రాలకు రూ.14 లక్షలు చొప్పున ఒక్కో సచివాలయ పరిధిలో సుమారు రూ.కోటి మంజూరు చేసి నూతన భవనాలను నిర్మిస్తోంది. ఇలా నియోజకవర్గంలో పలు నూతన భవనాలు మంజూరు కాగా, 40 శాతం భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని వినియోగంలోకి రాగా 30 శాతం భవనాలు నిర్మాణాలు దాదాపు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన భవనాల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.



తెరణిలో ప్రారంభమైన సచివాలయం

పల్లెలోనే ప్రభుత్వ సేవలు..



ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమస్యలు ఉంటే నేరుగా సచివాలయాల వద్దకు వెళ్లి సమస్యలు చెప్పుకుంటున్నాం. వారు ఆ సమస్య సంబంధించి ఫలానా అధికారికి సంబంధించి దరఖాస్తులు ఇలా చేయాలని చెప్తూ ప్రోత్సహిస్తున్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులు సచివాలయానికి వెళ్లి మాకు ఇంటి స్థలాలు ఎప్పుడు మంజూరు చేస్తారు ? పింఛన్ ఎప్పుడు వస్తుందనే విషయాలను తెలుసుకుంటున్నాం. అలాగే మాకు అవసరమైన ఎరువులు, విత్తనాలు గ్రామంలోని ఆర్బీకే కేంద్రంలోనే అందుతున్నాయి. పశువైద్యం కూడా గ్రామంలోనే అందుబాటులో ఉంది. అన్నిసేవలు పల్లెలోనే అందించడం అభినందనీయం.

– గోవిందయ్య, ముడిపల్లి

ప్రజల చెంతకే పాలన..



నూతన సచివాలయ కేంద్రాల ఏర్పాటుతో పల్లెల్లో ప్రజాపాలన కొనసాగడం ప్రారంభమైంది. సచివాలయాలు, వాటి అనుబంధ కార్యాలయాల్లో వలంటీర్లు సహకారంతో ప్రతి పల్లెలో రేషన్‌కార్డు మొదలు, రైతన్నలకు, వృద్ధులకు, రోగులకు అవసరమైన సేవలు గ్రామాల్లోనే అందుతున్నాయి. ఫలితంగా ఆ గ్రామ ప్రజలు సుదూరంగా ఉన్న డివిజన్, మండల కేంద్రాలకు వెళ్లకుండానే వారివారి ప్రజాసంక్షేమ పథకాలు పొందుతున్నారు. అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకాలు మంజూరు అవుతాయి. నూతన ప్రభుత్వ భవనాలు పల్లెల్లోనే నిర్మించడంతో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి.

– భార్గవి, ఎంపీపీ, నగరి

ప్రజలకు చేరువగా ప్రభుత్వం



వార్డుబాటలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి : ప్రజలకు చేరువగా ప్రభుత్వం ఉందని మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. మండలంలోని ముడిపల్లిలో వార్డు పర్యటన నిర్వహించారు. పార్టీ శ్రేణులతో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఇంతలా ప్రజలతో మమేకం కాలేదన్నారు. జగనన్న పాలనలో మాత్రమే ప్రభుత్వం ప్రజలకు చేరువగా ఉందన్నారు. అందుకే ప్రతి గడపలో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ కృష్ణయ్య, మాజీ ఎంపీపీ జయచంద్రారెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

సీఎం సహాయనిధి అందజేత

వడమాలపేట : మండల పరిధిలోని పూడి పంచాయతీ వేమాపురం గ్రామానికి చెందిన కన్నయ్య భార్య ఉషా ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. వాటి బిల్లులను మంత్రి ఆర్కే రోజా సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపించి, సాయం మంజూరు చేయించారు. ఆదివారం మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు కిరణ్, నగరి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

వడమాలపేట : మండలకేంద్రం సమీపంలోని బైపాస్ రోడ్డు మార్గంలో వెలసిన చెంచులక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు గురునాథం, శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ ఉదయం 6.20 నుంచి 11.30 గంటల మధ్య సుప్రభాతం, ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ట, దేవతా ఆహ్వానం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం అష్టదిగ్బంధనం, ధ్వజపట ప్రతిష్ట, ధ్వజస్తంభాభిషేకం, ధ్వజారోహణం, గరుడనైవేద్యం, నిర్వహిస్తామని తెలిపారు. 4వ తేదీన శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి, యాగం జరుగుతుందన్నారు. 5వ తేదీ వేదపారాయణం, ఆరాధన, అభిషేకం, పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రస్నానం అనంతరం చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

సత్తా ఉంటే రాజీనామా చేసి గెలవండి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామిని విమర్శించే అర్హత మీకుందా !
- అనవసర విమర్శలకు దిగితే గుణపాఠం తప్పదు
- డిప్యూటీ సీఎంపై విమర్శలు గుప్పిస్తే చూస్తూ ఊరుకోం
- కార్వేటినగరం మండల నాయకులు ఫైర్



మాట్లాడుతున్న కార్వేటినగరం వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామిని విమర్శించే అర్హత, స్థాయి రమేష్, పొన్నుస్వామి, సుందర్‌రాజ్‌కు లేదని మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు అన్నారు. ఆదివారం ఎంపీపీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా జరగని విధంగా పాదిరికుప్పం గ్రామాన్ని మంత్రి నారాయణస్వామి అభివృద్ధి చేశారని తెలిపారు. కానీ రమేష్, పొన్నుస్వామి, సుందర్‌రాజ్ కలిసి మంత్రిపై కక్ష సాధింపు ధోరణిలో విమర్శలకు దిగడం సరికాదని హెచ్చరించారు. నియోజకవర్గంలో వీరికి గుర్తింపు ఉందంటే డిప్యూటీ సీఎం మేనళ్లుడు కావడం వల్లేనని, ఈ రోజు రమేష్, సుబ్రమణ్యంకు సన్మానాలు, సత్కారాలు చేస్తున్నారంటే మంత్రిని చూసే అనే విషయాన్ని వారు గ్రహించాలని ఉప సర్పంచ్ శేషాద్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీగా, సర్పంచ్‌గా రెండుసార్లు ఓడిపోయిన వారు నారాయణస్వామి విజయానికి వెన్నెముక తామేనని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. పాదిరికుప్పం అభివృద్ధికి తుడా నిధుల నుంచి రూ.2 కోట్లు ఇప్పించిన ఘనత కూడా డిప్యూటీ సీఎందేనని గుర్తు చేశారు. అనంతరం మాజీ సర్పంచ్ దేశయ్య, శ్రీనివాసులు మాట్లాడుతూ పొన్నుస్వామి ఎంపీటీసీగా ఎన్నికల్లో తిరిగి గెలిచి ఉంటే పదవీ బాధ్యతలు తెలిసేవని, డిప్యూటీ సీఎం పుణ్యమా అంటూ ఏకగ్రీవం చేయడం వల్లే ఆయన మంత్రిపై విమర్శలు గుప్పిస్తున్నాడని దుయ్యబట్టారు. ధైర్యం ఉంటే డిప్యూటీ సీఎం పెట్టిన భిక్షతో ఎంపీటీసీగా కొనసాగుతున్న పొన్నుస్వామి పార్టీకి రాజీనామా చేసి ఎన్నికల్లో తన సత్తా చాటుకోవాలని సవాల్ విసిరారు. 40 ఏళ్ల అనుభవం ఉన్న మంత్రిపై కనీసం అర్హత లేనివారు ప్రెస్‌క్లబ్‌లో కూర్చుని సమావేశాలు పెట్టడం సిగ్గు చేటన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మాజీ సర్పంచ్ అమీద్ మాట్లాడుతూ తిన్నింటి వాసులు లెక్కించే ఇలాంటి వారు పార్టీకీ రాజీనామా చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మీరు ఒకరోజు మంత్రి నారాయణస్వామితో కలిసి నడిస్తే ఎవరికి వయసు మీద పడిందో తెలుస్తుందన్నారు. ఇప్పటికీ మంత్రికి మేనళ్లులుగానే వారిని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారని, కళ్లునెత్తికెక్కి మంత్రిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. స్వయంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున నారాయణస్వామికే టికెట్ ఖాయమని చెప్పారని, ఆయనను మరోమారు గెలిపించుకుని ఇదేస్థాయిలో చూడడమే మా లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ధనుంజయవర్మ, వెంకటేష్, పెరియస్వామిరెడ్డి, ఎంపీటీసీలు మురగయ్య, ధనశేఖర్, నాయకులు చందురాజు, విశ్వనాథరెడ్డి, శేఖర్, దాము, సురేష్, అంకయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నగరి : స్థానిక నగరి దక్షిణం ప్రాథమిక పాఠశాలలో 1995–96 విద్యాసంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిర పడిన వారు బాల్యంలో తాము పాఠశాలలో చేసిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో పాటు అప్పట్లో వారికి భోజనం వండిపెట్టిన వంటమనిషి అనితను సన్మానించారు. వీరికి ప్రధానోపాధ్యాయులు కుప్పరాజు, ఉపాధ్యాయులు రేవతి, వనజ, భవాని, శ్రీవాణి ఆశీస్సులను అందజేశారు.

ఘనంగా పాలేటమ్మకు పొంగళ్లు



పొంగళ్లు పెడుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలేడు గ్రామదేవత పాలేటమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు ఘనంగా పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాలేటమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిదేళ్లుగా వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకుంటూ, పొంగళ్లు పెట్టటం ఆనవాయితీగా వస్తుందని ఆలయ నిర్వాహకులు రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. భారీస్థాయిలో భక్తులు పాల్గొన్నారు.

తిరుకాంచి ఆలయంలో మంత్రి రోజా పూజలు



మంత్రి ఆర్కే రోజాతో అర్చకులు

సాక్షి, అమరావతి: పుదుచ్చేరిలోని తిరుకాంచి (గంగై వరాహ నదీశ్వరన్ స్వామి) ఆలయంలో మంత్రి ఆర్కే రోజా శంకరాభరణ ఆది పుష్కర హారతి పూజలో పాల్గొన్నారు. అనంతరం గంగా నదీశ్వర స్వామిని దర్శించుకున్నారు. పూజల్లో రోజాతో పాటు పుదుచ్చేరి స్పీకర్ ఆర్.సెల్వం, ఆ రాష్ట్ర మంత్రులు జయ కుమార్, చంద్ర ప్రియాంక పాల్గొన్నారు. తిరుకాంచిలోని గంగై వరాహ నదీశ్వరన్ ఆలయానికి దాదాపు మూడువేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ ఆలయం పక్కనే ప్రవహిస్తున్న శంకరాభరణి నదికి గంగై వరాహనదిగా, దక్షిణ భారతదేశ గంగా పేరుంది. గంగా పుష్కరాల సమయంలోనే ఈ నదికీ పుష్కరాలు నిర్వహించడం ఆనవాయితీ.

మంత్రి రోజాకు పాండిచ్చేరిలో ఘనస్వాగతం

నగరి : పాండిచ్చేరి విమానాశ్రయంలో మంత్రి ఆర్‌కే రోజాకు ఆ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి చంద్రప్రియాంక ఘనస్వాగతం పలికారు. ఆ మంత్రి ఆహ్వానం మేరకు పాండిచ్చేరి తిరుకాంజి (శ్రీ గంగా నదీశ్వర స్వామి) దేవస్థానంలో జరిగే శంకరాబరి ఆది పుష్కరం హారతి పూజల్లో పాల్గొనేందుకు మంత్రి ఆర్కేరోజా ఆదివారం పాండిచ్చేరికి వెళ్లారు. విమానాశ్రయంలో ఆమెను దుశ్శాలువలతో, పుష్పగుచ్ఛాలతో సత్కరించి రవాణాశాఖ మంత్రి ఆహ్వానించారు.



మంత్రి ఆర్‌కే రోజాను సత్కరిస్తున్న పాండిచ్చేరి రవాణాశాఖ మంత్రి చంద్రప్రియాంక

నేత్రపర్వంగా ద్రౌపదీ కల్యాణోత్సవం



ద్రౌపదీదేవీ కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు

కార్వేటినగరం: మండల పరిధిలోని అమ్మపల్లిలో జరుగుతున్న మహాభారత వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీద్రౌపదీ అమ్మవారి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం శ్రీకృష్ణ, ద్రౌపదీ సమేత భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులతో పాటు పోతురాజు ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి వడిబాల కట్టి, కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు ఆలయానికి వేంచేసిన అమ్మవారిని ఉభయదారులైన కేపీ అగ్రహారం గ్రామస్తులు సమర్పించిన పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి 9 గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పెళ్లి మండపానికి అమ్మవారిని తీసుకొచ్చి ముత్యాల తలంబ్రాలు పోసి శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. అదేవిధంగా మధ్యాహ్నం భాగవతారిణి సుమతి కల్యాణోత్సవం ఘట్టాన్ని భక్తులకు కనులకు కట్టినట్లు హరికథా రూపంలో చెప్పారు. అలాగే భక్తులకు అన్నదానం చేపట్టారు.

ఇళయరాజా కుటుంబాన్ని ఆదుకుంటాం



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: మండలంలోని అగరమంగళం ఎస్సీ కాలనీకి చెందిన ఇళయరాజా కుటుంబ సభ్యులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళయరాజా కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గత 10 రోజుల క్రితం అగరమంగళం ఎస్సీకాలనీకి చెందిన ఇళయరాజా జీడీనెల్లూరు సమీపంలోని జైన్ ఫ్యాక్టరీలో పని చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్మికుల చట్టం వర్తింపజేసేలా చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందిస్తామన్నారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కేశవులురెడ్డి, రైతుసంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీసర్పంచ్ పెద్దారెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ..

శ్రీరంగరాజపురం : మండలంలోని చిన్నతయ్యూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శివలింగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి మృతుడు శివలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ఆదుకుంటామని భరోసా కల్పించారు. మంత్రి వెంట జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి, ఎంపీపీ సరిత, సర్పంచ్ వరదమ్మ, నాయకులు జనార్దన్, మాజీ సర్పంచ్ బాబు, గండుమణి, ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రుద్రనాగమ్మకు ప్రత్యేక పూజలు





అమ్మవారి ఆలయానికి అంబలిని ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు, ప్రత్యేక అలంకరణలో రుద్రనాగమ్మ

పాలసముద్రం : మండలంలోని ఏట్టుకూరిపల్లెలో వెలసిన రుద్రనాగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు అంబలి, కొబ్బరికాయలు, కర్పూరం వంటి పూజా సామగ్రిని పంబవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. భక్తులు తీసుకొచ్చిన అంబలితో అమ్మవారిని అభిషేకించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.